నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 23 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఇటుకబట్టీల్లో వర్క్ సైట్ పాఠశాల ప్రారంభం

హాజీపూర్, జనవరి 22 : మండలంలోని బుగ్గట్టు ప్రాంతంలోని ఇటుకబట్టీల్లో వర్క్ సైట్ పాఠశాలను సోమవారం ఆపరేషన్ ముష్కాన్ ఎస్ఐ విజయ్‌కుమార్, ఎంఈవో పోచయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఈ పాఠశాలను ప్రారంభించామన్నారు. ఇటుకబట్టీల్లో పని చేసేందుకు వచ్చిన వారి కుటుంబాల్లో 50 మంది బడీడు పిల్లల్ని గుర్తించామని, వారి భాషలోనే బోధించేందుకు ట్యూటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారి ఇందిర, సెక్టోరియల్ అధికారులు చౌదరి, మూర్తి, ఇటుకబట్టీల నిర్వాహకులు పాల్గొన్నారు.


పిల్లలతో ఆపరేషన్ స్మైల్ అధికారులు


మంచిర్యాలలో భవ్య శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు, తరలివచ్చిన భక్తులు

# జై శ్రీరాం

- అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠతో మారుమోగిన పల్లెలు, పట్టణాలు
- కనుల పండువగా శోభాయాత్రలు
- ఆలయాల్లో ఎమ్మెల్యేలు, ప్రముఖుల పూజలు
- విగ్రహ ప్రతిష్ఠాపన మహాఘట్టాన్ని టీవీలు, స్క్రీన్‌లపై వీక్షించిన ప్రజలు
- పాత మామిడిపెల్లిలో మతసామరస్యాన్ని చాటిన మహ్మద్ సలీం


మంచిర్యాల శోభాయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, నాయకులు


ఆసిఫాబాద్ : కోదండ రామలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు


మంచిర్యాలలో శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు


మంచిర్యాలలో హనుమంతుడి వేశాధారణలో భక్తుడు

**నమస్తే నెట్‌వర్క్:** అయోధ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా సోమవారం పల్లెలు.. పట్టణాలు.. జై శ్రీరాం నామస్మరణతో మారుమోగాయి. రామాలయం, హనుమాన్ ఆలయాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు యజ్ఞాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో సీతారాముల చిత్రపటాలు, పట్టువస్త్రాలు, అక్షింతలతో బ్యాండ్ మేళాలు, మంగళహారతులు, కోలాటాల మధ్య కనుల పండువగా శోభాయాత్రలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆసిఫాబాద్‌లోని కోదండ రామాలయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సిద్దంశెట్టి సుహాసిని పాల్గొన్నారు. ఎస్పీ సురేశ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మెయిన్ మార్కెట్ నుంచి బాలభారతి హనుమాన్ ఆలయం వరకు తలంబ్రాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈఎస్ఐ అభయాంజనేయ స్వామి ఆలయం, సర్‌సిల్క్ రామమందిర్, బాలజీనగర్ శివాలయం, చింతగూడ హనుమాన్ మందిర్ వద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. మంచిర్యాల పట్టణంలోని జడ్పీబాలుర పాఠశాల మైదానంలో నిర్వహించిన సుదర్శణ నారసింహ యాగం, మహాపూర్ణాహుతిలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖ దంపతులు పాల్గొన్నారు. పాతమంచిర్యాలలోని రామాలయం, శివాలయం, భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామానుజ దేవనాథ జీయర్ స్వామి అధ్యక్షతన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ భవ్య శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జై శ్రీరాం... నినాదాలతో పట్టణం మారుమోగింది. మహిళలు కోలాటం, డీజే, చప్పుళ్ల నడుమ ర్యాలీ సాగింది. కోటపల్లి మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్‌లో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ పాల్గొన్నారు. భీమారంలోని కోదండరామాలయంలో నిర్వహించిన పూజల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. దండేపల్లి మండలం పాత మామిడిపెల్లి గ్రామానికి చెందిన మహ్మద్ సలీం మతసామరస్యాన్ని చాటాడు. నుదుట తిలకం దిద్దుకొని.. కాషాయ జెండాతో శోభాయాత్రలో పాల్గొన్నాడు.


తాండూర్‌లో భవ్య శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


కౌటాల: కోదండ రామాలయంలో అయోధ్య బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని కార్యక్రమాన్ని ఎల్ ఈడీ స్క్రీన్‌లో వీక్షిస్తున్న భక్తులు


దండేపల్లి : మామిడిపెల్లిలో ర్యాలీలో ముస్లిం సోదరుడు


కాగజ్‌నగర్ ఎస్పీయం కాలనీ : ప్రసాద వితరణలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావు


శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, శ్రీశ్రీశ్రీ రామానుజ దేవదూత జీయర్ స్వామి


కోటపల్లి : హనుమాన్ మందిర్‌లో భక్తులతో కలసి హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్


భీమారం : చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


జెండా ఊపి ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

## పేదల ఇండ్లకు ఉచితంగా ఇసుక

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు
- వేంపల్లి గోదావరిలో ఇసుక రీచ్ ప్రారంభం

హాజీపూర్, జనవరి 22 : ఇండ్లు నిర్మించుకునే పేదలకు ఉచితంగా ఇసుక రవాణా చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. సోమవారం వేంపల్లి గ్రామ శివారులోని గోదావరిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతేడాది ట్రాక్టర్ ట్రిప్పు ధరపై ప్రస్తుతం రూ.50 తగ్గిస్తున్నామన్నారు. వేంపల్లి గ్రామ ప్రజలకు తక్కువ ధరకు ఇసుకను అందిస్తామన్నారు. ఇండ్లు నిర్మించుకునే పేదలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా ఇంటికే ఇసుక రవాణా చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ బాలు, సర్పంచ్ ఓలపు శారద, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బాలరాజు, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐ మంగ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా ఇవ్వరు.. లెక్కలు చెప్పరు..

- ఇదీ టీఎన్‌జీవో యూనియన్ తీరు
- విషయం బయటికొచ్చాక గుర్తుకొచ్చిన బై-లా
- అద్దెల రూపంలో నెలకు రూ.లక్ష ఆదాయం
- ఆ రికార్డులు చూపాలంటే వారం పడుతుందంటూ దాటవేత
- రెవెన్యూ-పంచాయతీరాజ్ శాఖల్లోనే సభ్యత్వ నమోదు
- ఎన్నికలు వాయిదా వేసే యోచనలో కమిటీ?


మంచిర్యాలలోని టీఎన్‌జీవో కార్యాలయం కిందున్న షాపులు

మంచిర్యాల, జనవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా టీఎన్‌జీవోల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. ఎన్నికల సందర్భంగా యూనియన్ బై-లా పాటించడం లేదనే విషయం వెలుగులోకి రావడంతో పాటు తాజాగా టీఎన్‌జీవో లెక్కలపైనా చర్చ మొదలైంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టీఎన్ఎన్‌జీవో కార్యాలయం కింద ఉన్న షాపుల ద్వారా వచ్చే అద్దెలు, ఫంక్షన్ హాల్ ద్వారా ఆ సంఘానికి వచ్చే ఆదాయం నెలకు దాదాపు రూ.లక్ష వరకు ఉంటుంది. కానీ ఇందుకు సంబంధించిన లెక్కల రికార్డులను సరిగా నిర్వహించడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై టీఎన్‌జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరిని వివరణ కోరగా.. యూనియన్ బై-లా ప్రకారం అసెట్ రికార్డులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగైతే ఆ రికార్డులు చూపండి అని అడుగగా.. ఇప్పటికిప్పుడు అడిగితే ఎలా చూపిస్తామంటూ దాటవేశారు. పోయిన నెలదైనా చూపించాలని కోరగా.. అద్దెలు ఏ నెలది.. ఆ నెల ఇవ్వరు.. మూడు, నాలుగు నెలలకోసారి ఇస్తారు.. వారం, పది రోజులయ్యాక రండి రికార్డులు చూపిస్తామని చెప్పుకొచ్చారు. ఈ విషయమై టీఎన్‌జీవోలోని కొందరు ఉద్యోగులు గతంలోనే జిల్లా కమిటీని నిలదీయగా.. ముందున్న కమిటీ లెక్కలు మాకు చెప్పలేదని, ఇప్పుడు మేం కూడా చెప్పమంటూ ఆ సంఘాన్ని అన్నీ తానై నడిపే ఓ లీడర్ దురుసుగా సమాధానం ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అసలు యూనియన్ లెక్కలు ఉన్నాయా.. ఉంటే చూపించడానికి అంత టైమ్ ఎందుకని కొందరు టీఎన్‌జీవోలే ప్రశ్నిస్తున్నారు.

### నామమాత్రంగా సభ్యత్వ నమోదు..

టీఎన్‌జీవోల సభ్యత్వ నమోదు చేయకుండా, ఓటర్ జాబితా లేకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారనే ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో నామమాత్రంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలుస్తుంది. కాకపోతే ఇది అన్ని ప్రభుత్వ శాఖల్లో కాకుండా ఇప్పుడున్న కార్యవర్గానికి ఫేవర్‌గా ఉండే శాఖల్లోనే ఇది చేస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లోనే సభ్యత్వ నమోదు చేస్తున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లోనూ ఆ రెండు శాఖల ఉద్యోగులే పాల్గొంటారని.. వాళ్లే ఎన్నికల అధికారులు, వాళ్లే ఓటర్లు, ఎన్నికయ్యేది కూడా వాళ్లే అంటూ మిగిలిన శాఖల్లోని టీఎన్‌జీవోలు మండిపడుతున్నారు. విషయం బయటికి వచ్చినందుకే యూనియన్ నాయకులకు ఇప్పుడు బై-లా గుర్తుకు వచ్చిందంటున్నారు. ఉద్యోగుల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ టీఎన్‌జీవోను నడిపించే పెద్దలు ఏ మాత్రం పట్టించుకోకుండా ముందుకు వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. హడావుడిగా ఎన్నికలు నిర్వహించి యూనియన్ పగ్గాలు దక్కించుకోవాలనే కుట్రల్లో భాగంగానే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఎన్నికలకు వెళ్తున్నారని చెప్తున్నారు. 2023 డిసెంబర్‌లో సభ్యత్వ నమోదు చేసినట్లు చెప్తున్నా.. ఆ జాబితా ఇవ్వడానికి కూడా ప్రస్తుతం ఉన్న యూనియన్ పెద్దలు ఇష్టపడడం లేదంటున్నారు. ఓటర్ల జాబితా లేకుండా... యూనియన్ లెక్కలు తేల్చకుండా జిల్లాలోని ఆరు యూనిట్లలో ఎన్నికలకు ఎలా వెళ్తారు అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఆరోపణలకు సమాధానాలు చెప్పాలని, గడిచిన మూడేళ్ల ఆదాయ, వ్యయాల రికార్డులను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వారం, పది రోజుల టైమ్ అడిగేది లెక్కలను తారు మారు చేసేందుకేనని పలువురు ఆరోపిస్తున్నారు. అన్ని విషయాల్లో క్లారిటీ ఇచ్చాకే ఎన్నికలకు పోవాలని, ఈ మేరకు టీఎన్‌జీవో రాష్ట్ర నాయకత్వం చొరవ తీసుకోవాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఎన్నికలు వాయిదా...?

టీఎన్‌జీవో సంఘంలో వివాదాలు ముదరడంతో ఎన్నికలు వాయిదా వేసే ఆలోచనకు ప్రస్తుత జిల్లా కమిటీ వచ్చినట్లు తెలిసింది. వారం ముందు ఓటర్ జాబితా విడుదల చేయాలనే నిబంధన మేరకు ఈ నెల 28వ తేదీన ఎన్నికలు జరగాల్సిన చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లిలోని ఓటర్ల జాబితాను జనవరి 22వ తేదీనే(సోమవారం) ప్రచురించాలి. కానీ జాబితాను విడుదల చేయలేదు. 23న ఓటర్ల జాబితాను ప్రచురించడం, లేని పక్షంలో వారం పాటు ఎన్నికలను వాయిదా వేయడం అన్న విషయమై చర్చిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరి టీఎన్‌జీవోలు ఏం చేస్తారు.. వస్తున్న ఆరోపణలకు సమాధానాలు చెప్పి ఎన్నికలకు వెళ్తారా.. లేక దాటవేసే ధోరణిలోనే ఎన్నికలు పూర్తి చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

## గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నస్పూర్, జనవరి 22 : జిల్లాలో ఈ నెల 26న గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకల్లో ప్రభుత్వ శాఖల స్టాళ్లు ప్రదర్శించాలన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని వేడుకలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

### సమస్యలు పరిష్కరిస్తాం

అధికారుల సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, డీఆర్‌డీవో శేషాద్రితో కలిసి అర్జీలు స్వీకరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్


కార్పొరేట్ కొత్తగుడెం హెడ్డాఫీస్ ముందు ధర్నా చేస్తున్న రిటైర్డ్ కార్మికులు

## పెన్షన్ పెంచి.. సమస్యలు పరిష్కరించండి

- సింగరేణి రిటైర్డ్ కార్మికుల డిమాండ్
- హెడ్డాఫీస్ ఎదుట ధర్నా
- సీఎండీకి వినతి

శ్రీరాంపూర్, జనవరి 22 : పెన్షన్ పెంచి.. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కార్పొరేట్ కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట ధర్నా చేశారు. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్‌రావు, డిప్యూటీ ప్రధాన కార్యదరిశ అలవందార్ వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు భీరయ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, శేషయ్యతో కలిసి సీఎండీ బలరామ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయ హస్తం, 6 గ్యారంటీ స్కీమ్‌లు రిటైర్డ్ కార్మికులకు అమలు చేయాలని, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని, వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మిరెడ్డి, రాజయ్య, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, వెంకట్ పాల్గొన్నారు.

## ఓపెన్‌కాస్ట్ పేలుళ్లతో ఇండ్లు దెబ్బతింటున్నయ్

కాసిపేట, జనవరి 22 : మండలంలోని సోమగూడెం(కే)లో ఉప సర్పంచ్ కనుకుల రాకేశ్ అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించి అభివృద్ధి ప్రణాళిక రూపొందించారు. ఉప సర్పంచ్ కనుకుల రాకేశ్ మాట్లాడుతూ ఇటీవల కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో పేలుళ్ల తీవ్రత పెరిగిందని, ఇండ్లు దెబ్బతిని కూలిపోయే స్థితికి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం స్పందించాల్సిన అవసరముందని, ప్రజలంతా హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యం సాధ్యమేనా..?

- సకాలంలో పూర్తికాని కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్రియ
- వానకాలంలో 63 శాతం.. ఎండకాలంలో 31 శాతమే పూర్తి
- ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలంటూ ఆదేశాలు
- ఆందోళనలో మిల్లర్లు

*వానకాలం, ఎండకాలం సీజన్‌లలో ధాన్యం దండిగా పండగా, ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వడ్లను కొనుగోలు చేసిన సర్కారు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం మిల్లులకు అప్పగించింది. సకాలంలో ఆ ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో మిల్లర్లపై సీరియస్ అయ్యింది. వానకాలంలో 63 శాతం, ఎండకాలం లో 31 శాతం మాత్రమే సీఎంఆర్ కింద పెట్టగా, ఈ నెలాఖరులోగా 100 శాతం లక్ష్యం పూర్తి చేయాలంటూ ఆదేశాలిచ్చింది. ఇంకా తొమ్మిది రోజులే గడువు ఉండగా, యాజమాన్యాల్లో ఆందోళన కనిపిస్తున్నది.*


మిల్లులో బియ్యం

మంచిర్యాల అర్బన్, జనవరి 22 : జిల్లాలో 2022-23లో ధాన్యం దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చాయి. ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వడ్లు కొనుగోలు చేసిన అధికారులు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం పౌర సరఫరాల సంస్థ (సీఎస్‌సీ)కు, ఆహార భద్రత సంస్థ (ఎఫ్‌సీఐ)కు కేటాయించారు. మిల్లుల నుంచి వచ్చిన బియ్యాన్ని సివిల్ సప్లయ్, ఎఫ్‌సీఐ గోదాములకు తరలించి.. అక్కడి నుంచి నేరుగా రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే మిల్లర్లు తమకు కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోలేదు.

### 2022-23 వానకాలం 63 శాతం..

2022-23 వానకాలం సీజన్‌లో పౌర సరఫరాల శాఖ (సివిల్ సప్లై) డీఆర్‌డీఏ ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఇతర జిల్లాల్లోని మిల్లులతో పాటు జిల్లాలోని 19 బాయిల్డ్, 35 రా రైస్ మిల్లులకు 1,19,177 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపించారు. ఈ ధాన్యాన్ని మిల్లర్లు మిల్లింగ్ చేసి 79,848(బాయిల్డ్ 38,517, రా మిల్లులు 41,331) మెట్రిక్ టన్నుల బియ్యం సీఎస్‌సీ, ఎఫ్‌సీఐకి అందజేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు బాయిల్డ్ రైస్ మిల్లర్లు 29,374 (బాయిల్డ్ 4,845 , రా రైస్ మిల్లులు 24,529) మెట్రిక్ టన్నులు బియ్యం పెట్టారు. బాయిల్డ్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి 167 ఏసీకే(అక్నాలెడ్జ్‌మెంట్.. 1 ఏసీకే అంటే 290 క్వింటాళ్లు)ల బియ్యం పెట్టాల్సి ఉండగా, రా రైస్ మిల్లులు 846 ఏసీకేల బియ్యం పెట్టాల్సి ఉంది. మొత్తంగా 1,013 ఏసీకేల బియ్యం పెట్టాల్సి ఉంది. జిల్లా మొత్తంగా ఇప్పటి వరకు 63 శాతం బియ్యం ప్రభుత్వానికి సీఎంఆర్ కింద పెట్టారు.

### 2022-23 ఎండకాలం 31 శాతం..

2022-23 ఎండకాలం సీజన్‌లో పౌర సరఫరాల శాఖ (సివిల్ సప్లై) డీఆర్‌డీఏ ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఇతర జిల్లాల్లోని మిల్లులతో పాటు జిల్లాలోని 19 బాయిల్డ్, 8 రా రైస్ మిల్లులకు 82,859 మెట్రిక్ టన్నుల ధాన్యం అలాట్ చేశారు. ఈ ధాన్యాన్ని మిల్లర్లు మిల్లింగ్ చేసి 56,344(బాయిల్డ్ 49,313, రా మిల్లులు 7,031) మెట్రిక్ టన్నుల బియ్యం సీఎస్‌సీ, ఎఫ్‌సీఐకి అందజేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు బాయిల్డ్ రైస్ మిల్లర్లు 17,639 మెట్రిక్ టన్నులు పెట్టగా, రా రైస్ మిల్లర్లు అసలు బియ్యమే పెట్టలేదు. బాయిల్డ్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి 31,673 మెట్రిక్ టన్నులు అంటే 1092 ఏసీకేల బియ్యం పెట్టాల్సి ఉంది. రా రైస్ మిల్లులు 7,032 మెట్రిక్ టన్నులు అంటే 242 ఏసీకేల బియ్యం పెట్టాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్క ఏసీకే కూడా పెట్టలేదు. జిల్లా మొత్తంగా ఇంకా 38,705(బాయిల్డ్ మిల్లర్లు 31,673, రా మిల్లర్లు 7,032) మెట్రిక్ టన్నుల బియ్యం పెట్టాల్సి ఉంది. అంటే కేవలం 31 శాతం బియ్యమే ప్రభుత్వానికి పెట్టారు.

### గడువులోగా పూర్తి చేయాలి

**- గెడం గోపాల్, డీఎం సివిల్ సప్లై కార్పొరేషన్**

2022-23 వానకాలం, ఎండకాలంలో అనుకున్నదానికంటే రెట్టింపు ధాన్యం వచ్చింది. దీంతో మిల్లులన్నీ నిండుకున్నాయి. ఆ సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి తదితర జిల్లాల్లోని మిల్లులకు సైతం ధాన్యం పంపించాం. జిల్లాలోని మిల్లులకు సీజన్‌ల వారీగా కేటాయించిన ధాన్యానికి ఇవ్వాల్సిన సీఎంఆర్‌ను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలి. ఈ విషయమై ఇది వరకే మిల్లర్లకు తెలియజేశాం. గడువు దాటినా సీఎంఆర్ ఇవ్వని వారిపై చర్యలు తీసుకుంటాం. ఇంకా 9 రోజులే మిగిలి ఉంది. మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే.